# ★ ఉత్తరం ★

(కథ)

"సులోచన"

సూర్యోదయం అవుతోంది కాని పాలవర్షంలా కురిసే మంచులో సూర్యుని కాంతుల ఎరుపుదనం స్పష్టంగా అగపడటంలేదు. చలి విపరీతంగా ఉంది.

ఆ చలిలో ఒక ముసలివాడు వొణుకుతో, కర్ర పోటీతో నడుస్తో వీధిలోంచి వెళుతున్నాడు. వీధిలో జన సంచారం చాల పల్చగా ఉంది. దూరంగా ఫ్యాక్టరీ చప్పుడూ, షావుకారుగారి అరుగుమీది కుక్క అరుపూ, త్వరగా పనిలోకి వెళ్లే కూలి అడుగుల చప్పుడూ, వాకిటి ముంగ నీళ్ళు చల్లే ఒక ఇల్లాలి చప్పుడూ తప్ప—దాదాపు ఆ బజారంతా నిశ్శబ్దంగా ఉన్నదనవచ్చు. చాల మంది ఇంకా నిద్రాదేవి హస్తాల్లోంచి విడివడలేదు. చలి నిద్రను అధికపరుస్తుందనడంలో అసత్యంలేదు. అది కొంతమందిలో సోమరితనాన్ని కూడా తాత్కాలికంగా కల్పిస్తుంది.

ఆ ముసలివాడు చలిలో వూగులాడుతో ఆ వీధి చివరకు వచ్చాడు. ఆ వీధి మరో రోడ్డుకు దారితీసింది. సూర్య కిరణాలు మంచు మసకను చాల వరకు ఛేదించ గలిగాయి. రోడ్డుకు ఒక ప్రక్క చెట్ల వరుస. మరో ప్రక్క రాజాగారి గార్డెనూ, గార్డెను ప్రక్క నూతన పద్ధతులతో నిర్మింపబడిన ఓ అందమైన భవనం. మూసి ఉన్న తలుపులు, కిటికీల సందుల్లోంచి ఎండ యొక్క తెల్లని కాంతి లోపలకు పడుతోంది.

ఆ భవనంముందు ఒక బోర్డు ఉంది. ఆ బోర్డును చూడగానే ఆ ముసలివాడు మొట్టమొదటగా తన ప్రయాణపు అంతిమస్థలాన్ని చూసినప్పుడు యాత్రికుడు పొందే ఆనందంలాంటిది పొందాడు. ఆ బోర్డుమీద 'పోస్టాఫీసు' అని వ్రాయబడి ఉంది. ఆ ముసలివాడు, మెల్లిగావెళ్ళి, పోస్టాఫీసు వరండాలో నేలమీద స్తంభానికి ఆనుకుని కూర్చున్నాడు. గోడ అవతలనుంచి— అంటే ఆఫీసులో రెండు మూడు కంఠాల ధ్వని వినిపిస్తోంది. వాళ్ళు తమ పనిలో నిమగ్నులై వున్నారు.

'పోలీసు సూపర్నిడెంటు' ఒక కంఠం వినవచ్చింది. ఆ ముసలివాడి కళ్ళు ఆశతో మెరిశాయి.

పేరు తరువాత పేరు చదువుతున్నాడు. కమీషనర్, సూపర్నిడెంటు, దివాన్‌సాహెబ్, లైబ్రేరియన్, నాయుడుగారు,— ఈవిధంగా ఉత్తరాలమీద అడ్రసులు చదువుతున్నాడు.

ఆసమయంలో ఒక గొంతు వినవచ్చింది. "నారాయణస్వామి"

ముసలివాడు ఒక్కసారి ఉత్సాహంతోలేచి, కృతజ్ఞతగా ఆకాశంవంక చూసి, ద్వారం దగ్గరకు వచ్చాడు.

"నీలకంఠం బాబూ!"

"ఎవరు?"

"నారాయణస్వామి పేరును మీరు పిలిచారుగదూ! ఇక్కడె ఉన్నాను. ఉత్తరం కోసం వేచి ఉన్నాను."

"వాడు పిచ్చివాడండి. మనల్ని ప్రతిరోజూ ఉత్తరం వొస్తుంది— ఇవ్వమని వేధిస్తూ ఉంటాడండి కాని ఆ ఉత్తరం ఎన్నడూ రాదండి." అన్నాడు క్లర్కు పోస్టుమాన్‌తో విసుగ్గా.

ముసలివాడు నిరాశచెంది, మళ్ళీ తను అయిదు సంవత్సరాలుగా రోజూ కూర్చునే చోటు దగ్గరకు వెళ్ళి కూర్చున్నాడు.

ఒకప్పుడు నారాయణస్వామి మంచి సరదా అయిన మనిషి. వేటకు వెళ్ళితే ఎంత చిన్న పక్షినైనా ఇట్టే కొట్టేవాడు. అతని చూపులు అంత వాడి గలవి. క్రూర జంతువులుసైతం అతన్నిచూస్తే గజగజలాడేవి.

కాని అతని జీవితపు సంధ్యా సమయంలో పరిస్థితులు తారుమారయ్యాయి. అతని ఏకైక ప్రియ పుత్రిక లక్ష్మి వివాహం చేసుకొని, అతనికి దూరమైంది. ఒక సైనికునితో ఆమె మరో దేశానికి వెళ్ళిపోయింది. గత అయిదు సంవత్సరాలుగా ఆమెను గురించి ఎటువంటి వివరాలూ లేవు. ఆముసలివాడు ఇప్పుడు జీవితపు శకటాన్ని మెల్లగా లాగుతున్నాడు. అతనికి పుత్రికమీద ప్రేమ, ఎడబాటువల్ల బాధ— బోధపడుతూంది. పూర్వపు శక్తి,

వేటయందు ఆసక్తి, ఉత్సాహం— ఇప్పుడు అతనిలో లేవు. లక్ష్మి వెళ్ళిపోయిన దగ్గర్నుంచీ ఆ ముసలివాడు భరించరాని ఏకాంతాన్ని అనుభవిస్తున్నాడు. దేనిమీదా అభిరుచిలేదు. పచ్చని పొలాలూ, అందమైన పక్షులూ, రుచ్యమైన పదార్థాలూ— దేనిమీదా అతనికి మనసుపోవ డంలేదు. ఈ ప్రపంచం మొత్తం ప్రేమ అనే పదార్థంతో నిర్మింపబడి ఉన్నదని, ఎడబాటుయొక్క దుఃఖం తప్పించుకో నలవికాదనీ అతను నిశ్చయానికి వొచ్చాడు. చెట్టుక్రింద కూర్చుని భోరున ఏడ్చాడు. ఆరోజునుంచి, నిత్యమూ ఉదయం నాలుగింటికే లేచి— పోస్టాఫీసుకు రావటం మొదలెట్టాడు. కాని అతని జీవితం మొత్తం మీద ఒక్క ఉత్తరం కూడా రాలేదు. కాని కళ్ళల్లో కరగి పోని ఆశను నిక్షిప్త పరుచుకుంటో, ఎప్పుడేనా ఉత్తరాన్ని పొందలేక పోతానా అనే నమ్మకంతో— అందరికంటె ముందుగా పోస్టాఫీసుకు వొస్తూవుంటాడు.

ఆముసలివానికి పోస్టాఫీసు ఒక పుణ్యక్షేత్ర స్థలం లాంటిది. అతను ఎప్పుడూ పోస్టాఫీసులో ఒక ప్రత్యేక స్థలంలో కూర్చుంటాడు. అతనిని నిత్యమూ చూడటానికి అలవాటు పడిన ప్రజలు అతనినిచూసి నవ్వుతూవుంటారు. పోస్టు ప్యూనులు ఆముసలివాణ్ణి తరుచు ఆడించడంకద్దు. ఏమీ ఉత్తరం లేకపోయినప్పటికీ అతన్ని పిలవడమూ ఆశతో గంతువేసుకుంటో వచ్చే అతని ఆనందాన్ని తిల కించి నవ్వుకోవడమూ చేస్తూ వుంటారు. కాని ఆముసలి వాడు నిత్యమూ ఎడతెగని నమ్మకంతో, మిక్కిలి ఓర్పుతో పోస్టాఫీసుకు వొస్తూ— ఉత్తచేతులతో తిరిగి వెళుతూవుంటాడు.

ఒకరోజు పోస్టుమాస్టరు వరండాలో కుర్చీ వేసుకు కూర్చున్నాడు. ప్యూనులు ఉత్తరాలు అక్కడ వొచ్చిన వాళ్ళకు చూసి యిస్తున్నారు.

"పోలీసు కమీషనర్" ప్యూను పిలిచాడు. ఒక యువకుడు ఆ ఉత్తరాలు తీసుకెళ్ళేందుకు వచ్చాడు.

"బ్యాంక్!" ఒక తలపాగా చుట్టుకున్న నడివయ స్సులో ఉన్న యువకుడు బ్యాంక్‌కు సంబంధించిన ఉత్త రాలన్నీ తీసికెళ్లేందుకు వచ్చాడు.

"హైస్కూలు" హైస్కూలుకు సంబంధించిన ప్యూను వచ్చాడు.

ఈవిధంగా నిత్యకృత్యం జరుగుతోంది. చివరకు అందరూ వెళ్ళిపోయారు. నారాయణస్వామికూడా పోస్టా ఫీసుకు నమస్కారం చేసి వెళ్ళిపోయాడు.

"వాడేమన్నా పిచ్చివాడా?" అన్నాడు క్లర్కుతో పోస్టుమాస్టరు ఆ ముసలివానివంక చూస్తూ.

"ఎవరు? ఓ, నారాయణస్వామా?· అవును అతను అయిదు సంవత్సరాలుగా వస్తూ పోతూ ఉన్నాడు. కాని ఏం ఉత్తరాలు వచ్చినట్టు లేవు?"

"నాకు అర్థమైంది. ఇతనికి ఉత్తరం వ్రాసేవాళ్ళకు మట్టుకు రోజూ టైం ఉండొద్దూ?"

"అతను పూర్వకాలంలో చాల తప్పులు చేసి ఉన్నా డండి. వాటి పరిహారార్థం ఇప్పుడు అవస్థ పడుతున్నాడు" అన్నాడు పోస్టుమాన్.

"పిచ్చివాళ్ళు అపూర్వమైన వ్యక్తులు". అన్నాడు పోస్టుమాస్టర్.

"అవునండి. అహమ్మదాబాదులో ఒక పిచ్చివాణ్ణి చూశాను. వాడెప్పుడూ బజార్లో దుమ్మును కుప్పలుగా చేస్తూ ఉంటాడు. ఇంకొకడికి రోజూ నదికివెళ్ళి ఒక రాయిమీద కూర్చుని నీళ్ళు విరజిమ్మే అలవాటు."

"అంతేకాదు. నేనొక పిచ్చివాణ్ణి ఎరుగుదును. వా డెప్పుడూ నోటికొచ్చిన పద్యాల్ని వల్లె వేస్తూఉంటాడు."

పోస్టాఫీసులోని ప్రతీ వ్యక్తీ పిచ్చితనంమీద తమకు తోచిన అభిప్రాయాల్ని ఇవ్వడం మొదలెట్టారు. విరామసమయాల్లో కూడి ఒకచోట చేరి కొద్దినిమిషాల పాటు ఏదైనా సమస్యమీద మాట్లాడడం— ఉద్యోగస్థు లకు అలవాటే. ఆ సంభాషణలను కొంతసేపు విన్నాక పోస్టుమాస్టరు లేచి అన్నాడు.

"పిచ్చివాళ్ళు తమ లోకంలోనే విహరిస్తారు. వాళ్లకు మనం పిచ్చివాళ్ళలా అగపడడంలో కూడా వింతలేదు. పిచ్చివాళ్ళ ప్రపంచం— కవుల భావనా ప్రపంచంలాగ ఉంటుందని భావిస్తాను" ఆ చివరిమాట అంటూ ఒక క్లర్కువంక చూస్తూ పోస్టుమాస్టర్ను నవ్వాడు. ఆ క్లర్కు కవిత్వం రాస్తాడు. తరువాత అతను వెళ్ళిపోయాడు. ఆఫీసుపని స్టాగుతోనే ఉంది.

## ఉత్తరం

చాలా రోజులవరకూ నారాయణస్వామి మళ్ళీ పోస్టాఫీసు చాయలకు రాలేదు. ఆముసలివాడు రాకపోవడానికి గల కారణాన్ని అందులో ఎవ్వడూ పూర్తిగా ఊహించ లేకపోయినప్పటికీ, అతని రాకను ఆడ్డు పరచిన పరిస్థితులను తెలుసుకొనే కుతూహలానికి వాళ్ళు బాగా గురయ్యారు. కాని చివరకు అతను వచ్చాడు. కాని మనిషిలో వార్ధక్యం • బాగా ముదిరింది. ఊపిరి పీల్చుకునే స్థితిలో లేనట్లు అగపడుతున్నాడు. ముఖంలో జీవితపు అవసానదశ తాలూకు చిహ్నాలు ప్రస్ఫుటంగా అగపడుతున్నాయి. ఆరోజు అతనిలో ఆట్టే ఓర్పులేదు.

"ఏమండీ ! లక్ష్మి దగ్గర్నుంచి నాకేమన్నా ఉత్తరం వచ్చిందాండీ !" పోస్టుమాష్టర్ను దీనంగా అడిగాడు నారాయణస్వామి.

పోస్టుమాష్టరు బయటికి వెళ్ళే తొందరలో ఉన్నాడు.

"చీడపురుగులా ఉన్నావే !" అన్నాడు విసుగ్గా.

" నాపేరు నారాయణస్వామండీ !" అన్నాడు నారాయణస్వామి మతిపోయినవాడల్లే.

"నాకు తెలుసు. మీ లక్ష్మి పేరు మేము రిజిష్టరు చేసుకున్నామని అనుకుంటున్నావా ?"

"లేకపోతే రాసుకోండి నేను లేకపోతే ఏదైనా ఉత్తరం వస్తే మీకు ఉపయోగంగా ఉంటుంది" కాని ఆ ముసలివాడికి ఏంతెలుసు తనకు ప్రాణసమానమైన తన లక్ష్మి పేరు ఇతరవాళ్లకు ఒక్కపైసకుకూడా సరిపోలదని ?

పోస్టుమాష్టరుకు ఉన్నకొలదీ విసుగూ, అసహ్యం జాస్తి కాజొచ్చింది. "నీకేమన్నా మతివుందా లేదా ! అవతలకువెళ్ళు నీ ఉత్తరం మేము తింటామనుకున్నావా ?" పోస్టుమాష్టరు త్వరగా నడిచివెళ్ళాడు. దిగాలు పడుతూ మెల్లగా పోస్టాఫీసు బయటికి రాలేకరాలేక వచ్చాడు. ఆముసలివాని కళ్ళు నిరాశాజనితమైన నీళ్లతో నిండిపోయాయి. అతనిలో ఓర్పు ఇంకి పోయింది. అయినప్పటికీ అతనికి నమ్మకం పోదల్లేదు.

నారాయణస్వామి క్లర్కును అడిగాడు : "ఏమండీ !"

క్లర్క్ ఆశ్చర్యపోయాడు.

"ఏమిటి ?"

"ఇది చూడండీ !" అంటూ నారాయణస్వామి ఒక సంచిలోంచి అయిదు రూపాయీల నాణాలనుతీసి క్లర్కు చేతిలో పెట్టాడు. "ఆశ్చర్యంగా చూడకండి. అది మీకు చాల ఉపయోగపడవొచ్చు. కాని నాకు ఉపయోగపడవు. కాని మీరు దయయుంచి ఒక పని చేయాలి ?"

"ఏమిటి ?"

"మీరు ఆకాశంలో ఏం చూస్తారు ?" అన్నాడు నారాయణస్వామి ఆకాశంవంక చూపిస్తూ.

"స్వర్గం !"

"భగవంతుడు అక్కడ ఉన్నాడు. ఆ భగవంతుని సమక్షంలో మీకు నేను యీ డబ్బు యిస్తున్నాను. లక్ష్మి ఉత్తరం నాకు వచ్చినప్పుడు మీరు వాన్ని నాకు పంపాలి"

"ఎక్కడ ? నువ్వు ఎక్కడ ఉంటావని నేను పంపించేది ?" అన్నాడు క్లర్కు మొదలని ఆశ్చర్యంతో.

"నా సమాధిలోకి !"

"ఏమిటి ?"

"అవును. నిజం ! ఇవాళే నా జీవితానికి ఆఖరిరోజు. నేను నాలక్ష్మిని ఇంక చూడబోను. ఆమెనుంచి ఇంకా ఉత్తరం రాలేదు." ఆ ముసలి నారాయణస్వామి కళ్ళనుంచి కారే కన్నీళ్లను చూడలేక— ఆ క్లర్కు తనదారిని తాను వెళ్ళాడు జేబులో రూపాయలను మ్రోగించుకుంటూ.

నారాయణస్వామి మళ్ళీ అగపడలేదు. అతని జాడ కనుక్కునే శ్రమ ఎవ్వరికీ పట్టకపోయింది.

కాని ఒకరోజు ఆ శ్రమ పోస్టుమాస్టరుకు కలిగింది. అతనికూతురు ప్రక్క బస్తీలో జబ్బులో ఉంది. ఆమె క్షేమ సమాచారాలు వినే ఆసక్తిలో ఉన్నాడు. పోస్టు వొచ్చింది. ఉత్తరాలు ఆయన టేబిల్ మీద పెట్టబడ్డాయి. తాను నిరీక్షించే కవరు లాంటిది అగపడగానే వెంటనే ఆదుర్దాతో తీసుకున్నాడు, కాని దానిపైన నారాయణస్వామి అడ్రసు వ్రాసి ఉన్నది. ఎలక్ట్రిక్ షాకు తిన్నట్టు ఆ ఉత్తరాన్ని జారవిడిచాడు. క్రమేపీ ఆయన హృదయం విచారంలో మునిగి పోయింది. కొన్ని సంవత్సరాలుగా నిరీక్షించే ఆముసలి వానిదే యీ ఉత్తరం అయివుంటుంది అతని కూతురు లక్ష్మి దగ్గర్నుంచే వొచ్చివుంటుంది.

'రామదాసూ !' పోస్టుమాష్టరు క్లర్కును పిలిచాడు

ఆ క్లర్కుకే నారాయణస్వామి ఆరోజు అయిదు రూపాయలు యిచ్చింది.

"ఏమిటండీ?"

"నారాయణస్వామికి ఉత్తరం వొచ్చింది. ఇప్పుడు అతను ఎక్కడ ఉంటున్నాడు?"

"నేను కనుక్కుంటాను"

పోస్టుమాస్టరుకు ఆరోజు రావాల్సిన ఉత్తరం రాలేదు. ఆరోజు రాత్రంతా ఆయన మనస్సు చికాగ్గానే వుంది. తెల్లవారుఝామున నాలుగుగంటలకే లేచాడు. నారాయణస్వామి కోసం ఎదురుచూడ నారంభించాడు. అతని ఉత్తరాన్ని యిచ్చేందుకు.

ఇప్పుడు ఆపోస్టుమాస్టరుకు నారాయణస్వామి హృదయం అర్థమైంది. తనకూతురు క్షేమసమాచారాన్ని కనుక్కొనేందుకు ఒక్కరాత్రిలోనే ఆరాటాన్ని, బాధనీ అనుభవించిన ఆయన హృదయంలో —— అయిదు సంవత్సరాలుగా అటువంటి ఆరాటాన్ని, బాధనీ అనుభవించిన నారాయణస్వామి మీద సానుభూతి కలిగింది. ఉదయం అయిదు గంటలకు తలుపు ఎవరో కొట్టారు. అతను నారాయణస్వామే అయివుంటాడని ఆపోస్టుమాష్టరు తలంచాడు. కుర్చీలోంచి వెంటనేలేచి తలుపు తెరిచాడు.

"రా. లోపలకురా! నారాయణస్వామి!" బయట నిలబడి ఉన్న ముసలివాడికి ఉత్తరం ఇచ్చాడు. నారాయణస్వామి చేతికర్ర ఆధారంమీద నిలబడ్డాడు. కళ్ళ వెంట నీళ్ళు ధారాపాతంగా కారుతున్నాయి. అతనుకళ్ళుతుడుచుకున్నాడు. వెంటనే ముసలివాని కళ్ళు దేదీప్యమానంగా వెలుగజొచ్చినయ్. ఆ ముసలివాని కళ్ళలోని కాంతులకు పోస్టుమాష్టరు ఆశ్చర్య పోతూ వెనక్కి తగ్గుతున్నాడు.

పోస్టుమాష్టరు మాటల్ని ఆటువొస్తూ రామదాసు విన్నాడు.

"వీడెవరండీ! నారాయణస్వామా?"

కాని పోస్టుమాష్టరుకు ఎవ్వరూ అగపడలేదు. నారాయణస్వామి అదృశ్యమైన ద్వారంవంక చూస్తున్నాడు. అతను ఎక్కడకు వెళ్ళాడు?

"అవును నేను నారాయణస్వామి తోనే మాట్లాడుతున్నాను." అని రామదాసుతో అన్నాడు పోస్టుమాస్టరు.

"నారాయణస్వామి చనిపోయాడండీ!" ఆ ఉత్తరం నాకివ్వండి" అన్నాడు రామదాసు.

"ఏమిటి? నారాయస్వామి చనిపోయాడా? ఎప్పుడు? నిజంగా నీకు తెలుసా?"

"అవునండీ మూడు నెలలక్రితమే ఆముసలివాడు యీ లోకాన్ని విడిచి వెళ్ళిపోయాడండీ?" అన్నాడు అప్పుడే వొచ్చిన ఒక పోస్టుప్యూను.

పోస్టుమాష్టరు దిగ్భ్రమ చెందాడు. లక్ష్మి ఉత్తరం ద్వారం దగ్గిరే పడిఉంది. నారాయణస్వామి రూపు ఇంకా ఆయన నేత్రాల ముందు తారట్లాడుతోనే ఉంది. రామదాసు మాటలు విన్నప్పటికీ, ఆయన కళ్ళముందు నారాయణస్వామి ఉత్తరం కోసం తలుపు కొట్టడమూ, తను ఉత్తరం ఇవ్వడమూ, అతని కళ్ళలోని కన్నీళ్ళను చూడటమూ— అంతా వాస్తవంగా అగపడుతూనే ఉంది. ఆయన సందిగ్ధంలో పడ్డాడు. తను నిజంగా నారాయణస్వామిని చూశాడా? తనుచూచిన దంతా మిధ్యేనా? ఒక వేళ అతను రామదాసేమో!

నిత్యం జరిగే పని జరుగుతూనే ఉంది. ప్యూను ఉత్తరాలపైని అడ్రసులను చదువుతూనేఉన్నాడు. పోలీస్ కమీషనర్ బ్యాంక్ మేనేజరు. లైబ్రేరియన్,....

కాని పోస్టుమాష్టరు వాటిని కవర్లు కార్డుల దృష్టితో మునుపటిలాగ చూడటంలేదు. ఆయన ప్రతి ఉత్తరం యొక్క అవశ్యకతను నిజమైన విలువనూ చూస్తున్నాడు.

ఆరోజు సాయంకాలం రామదాసూ, పోస్టుమాష్టరూ నారాయణస్వామి సమాధి దగ్గరకు వెళ్ళారు. వాళ్ళు లక్ష్మి ఉత్తరాన్ని సమాధి మీదపెట్టి వెనక్కి తిరిగారు.

"రామదాసూ! ఇవాళ ఉదయం నిజంగా నీవుముందుగా ఆఫీసుకు వచ్చావా?"

"అవునండీ! నేనే ముందుగా ఆఫీసుకు వచ్చాను".

"అయితే ...ఏంలేదు నాకేమి అర్థంకావడం లేదు"

"ఏమిటండీ!"

"ఆఁ, ...ఏమిలేదు"అన్నాడు పోస్టుమాష్టరు మెల్లగా

పోస్టాఫీసు దగ్గర రామదాసూ, పోస్టుమాష్టరూ విడిపోయారు.

పోస్టుమాష్టరు ఇంట్లోకొచ్చి గదిలో కూర్చున్నాడు. కాని ఆయనహృదయంలో అలజడి ఎక్కువైంది.

తను నారాయణస్వామి యొక్క ఆతుర్దాని అర్థంచేసుకోలేక పోయాడనేబాధతో ఆయనఆరాత్రి మనస్సుకు శాంతి లేకండా గడిపాడు.

(గౌరీశంకర్ జోషి వ్రాసిన కథకు అనుసరణ.)